క్లుప్తంగా

స్కానింగ్ సెంటర్లలో తనిఖీలు

ప్రకాశంనగర్: నగరంలోని గోకవరం బస్టాండ్ వద్ద ఉన్న స్కానింగ్ సెంటర్, జయ కిడ్నీ అండ్ మెటర్నిటీ సెంటర్, సుధా స్కానింగ్ సెంటర్లను డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రీహరి ఆధ్వర్యంలో అధికారుల బృందం తనిఖీ చేసింది. స్కానింగ్ చేసే విధానంతో పాటు మెషీన్లను పరిశీలించింది. లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించరాదని, ప్రతి స్కాన్‌కు ఆధార్ నంబర్ తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఓ నాగు, సూపర్‌వైజర్ శ్రీను, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సెబ్ విస్తృత దాడులు



స్వాధీనం చేసుకున్న సారా, ప్లాస్టిక్ డ్రమ్ములు, నిందితుడిని చూపుతున్న సిబ్బంది

రాజమహేంద్రవరం రూరల్: జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఆఫీసర్ పిట్టా సోమశేఖర్ ఆదేశాల మేరకు బుధవారం సెబ్ రాజమహేంద్రవరం సౌత్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పి.హనుశ్రీ, సిబ్బందితో నాటుసారా తయారీ ప్రదేశాల్లో విస్తృత దాడులు నిర్వహించారు. ఐదు కేసులు నమోదు చేసి, 28 లీటర్ల సారా, 180 ఎంఎల్ 34 డ్యూటీ పెయిడ్ లిక్కర్ సీసాలు, 650 ఎంఎల్ 12 బీరుబాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. 400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. రాజానగరం మండలం నరేంద్రపురం గ్రామానికి చెందిన నీల మంగ, వనుం రవీంద్ర, ముక్కినాడ గ్రామానికి చెందిన మందేల్లి మరియమ్మ, రాజమహేంద్రవరం అర్బన్ తాడితోటకు చెందిన అల్లం చిన్నఅప్పన్న, రూరల్ మండలం కవలగొయ్యి గ్రామానికి చెందిన మట్ట సత్తిబాబును అదుపులోకి తీసుకుని, రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ పి.హనుశ్రీ తెలిపారు. సెబ్ సౌత్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో రహస్య ప్రదేశాల్లో మద్యం నిల్వ ఉంచితే 94409 02411, 96035 17003, టోల్ ఫ్రీ నంబర్ 14500కు సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఆమె అన్నారు. ఈ దాడుల్లో ఇన్‌స్పెక్టర్ పి.హనుశ్రీ, సబ్ ఇన్‌స్పెక్టర్లు వై.దుర్గాప్రసాద్, బి.శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

స్పందించిన మానవత్వం



నిత్యావసర సరకులు అందజేస్తున్న రమేష్‌చంద్ర నాయుడు దంపతులు

ధవళేశ్వరం: మానవత్వం స్పందించింది.. ఓ కుటుంబానికి చేయూతగా నిలిచింది. ధవళేశ్వరంలోని జాలరిపేటకు చెందిన ఎం.లక్ష్మి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. ఆ కుటుంబానికి ఆమే ఆధారం. మృతురాలి భర్త జగన్నాథం వికలాంగుడు, ముగ్గురు ఆడపిల్లలతో బాధిత కుటుంబం ఇబ్బందులు పడుతోంది. ఈ విషయాన్ని స్థానిక జంగాల వీధికి చెందిన గవర రమేష్‌చంద్రనాయుడు, చాముండేశ్వరి దంపతులు తెలుసుకుని పెద్ద మనసుతో స్పందించారు. ఆ కుటుంబానికి నెలకు సరిపడా నిత్యావసర సరకులను అందించారు. తమ కుమారుడి పుట్టిన రోజును పురస్కరించుకుని ఈ సాయం చేసినట్లు వారు తెలిపారు.

భోజనం ప్యాకెట్ల వితరణ



భోజన ప్యాకెట్లు అందజేస్తున్న శాంసన్ జాషువా

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక సరస్వతీ ఘాట్, రోడ్డు కం రైలు బ్రిడ్జి కింద ఉన్న నిరాశ్రయులకు బుధవారం గుడ్ సమరిటన్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు దొలూరి శాంసన్ జాషువా భోజన ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొంతకాలంగా తమ సంస్థ ద్వారా వితంతువులు, నిరాశ్రయులకు పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. పేదలకు మరిన్ని సేవలు చేస్తామన్నారు.

13న ప్రథమ చికిత్స కేంద్రాలు

రాజమహేంద్రవరం రూరల్: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా జిల్లాలో ఈ నెల 13న జరగనున్న పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ కేంద్రాల వద్ద ప్రథమ చికిత్స కేంద్రాలు ఏర్పాటు చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు పీహెచ్‌సీ వైద్యాధికారులను ఆదేశించారు. బుధవారం బొమ్మూరులోని డీఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయం నుంచి జిల్లాలోని పీహెచ్‌సీ వైద్యాధికారులతో ఆయన జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఆ రోజు పోలింగ్ కేంద్రాల వద్ద ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకూ ప్రథమ చికిత్స కేంద్రాలను వైద్య సిబ్బందితో నిర్వహించాలన్నారు. ఏదైనా అవసరం ఉన్నట్లయితే వెంటనే పైఅధికారులకు తెలియపరిచి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఉన్న వైద్యాధికారులకు రెఫర్ చేయాలని కోరారు.

జనరంజకంగా జగన్ పాలన

- సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి భరత్‌రామ్
- చంద్రబాబు హామీలన్నీ అబద్ధాలే..



ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతున్న మార్గాని భరత్‌రామ్



ప్రచారం చేస్తున్న మార్గాని భరత్‌రామ్, డాక్టర్ గూడూరి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ: ఈ ఐదేళ్లు రాష్ట్రంలో సీఎం జగన్ జనరంజక పాలన సాగించారని, ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి జగనన్నను మరోసారి గెలిపించాలని ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి మార్గాని భరత్‌రామ్ విజ్ఞప్తి చేశారు. బుధవారం నగరంలోని 6, 8, 12, 49 డివిజన్లలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా భరత్‌రామ్ మాట్లాడుతూ మనల్ని నమ్మించి మోసం చేసే చంద్రబాబుకు ఓటు వేస్తే అవినీతికి పర్మిషన్ ఇచ్చినట్టేనన్నారు. 2014 ఎన్నికల్లో చంద్రబాబును గెలిపించడంతో అభివృద్ధి కుంటుపడిందని, మళ్లీ అటువంటి పొరపాటు చేయవద్దని అన్నారు. గత ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి ఏ విధంగా పట్టం కట్టారో ఇప్పుడు అంతకుమించి మెజారిటీతో రాష్ట్రంలో జగనన్న ఘన విజయం సాధించేలా ప్రతి ఒక్కరూ మద్దతు ఇవ్వాలన్నారు. రాష్ట్రానికి, ప్రజలకు జగనన్న వల్లే మంచి జరిగిందన్నారు. సంక్షేమ పాలనతో పేదల జీవితాల్లో వెలుగులు నిండాయని, మహాత్మా గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని జగనన్న తన పాలన ద్వారా చూపారన్నారు. దేశంలోనే ఇంతటి గొప్ప ప్రభుత్వం ఏ రాష్ట్రంలో లేదన్నారు. ఇన్ని సంక్షేమ పథకాలు మరే రాష్ట్రంలో అమలు చేయలేదన్నారు. మనసున్న మంచి మనిషి జగనన్న సీఎంగా ఉంటేనే రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందుతుందన్నారు. ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న డాక్టర్ గూడూరి శ్రీనివాస్, సిటీ ఎమ్మెల్యేగా పోటీచేస్తున్న తనను అఖండ మెజారిటీతో గెలిపించాలని ఎంపీ భరత్‌రామ్ కోరారు. ప్రచారంలో డాక్టర్ గూడూరి శ్రీనివాస్, రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు, శ్రీగౌతమీ జీవకారుణ్య సంఘ చైర్మన్ బర్రే కొండబాబు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలోకి టీడీపీ మాజీ కార్పొరేటర్

టీడీపీలో 32 ఏళ్లు కొనసాగిన మాజీ కార్పొరేటర్ పితాని లక్ష్మీకుమారి, కుటుంబరావు దంపతులు వారి అనుచరులతో వైఎస్సార్ సీపీలో చేరారు. స్థానిక ఎంపీ కార్యాలయంలో వీరికి ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి భరత్‌రామ్, రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు, బీసీ జేఏసీ రాష్ట్ర చైర్మన్ మార్గాని నాగేశ్వరరావులు పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా భరత్‌రామ్ మాట్లాడుతూ శెట్టిబలిజ, గౌడ సామాజిక వర్గీయుల్లో ప్రముఖులైన పితాని కుటుంబరావు, మాజీ కార్పొరేటర్ పితాని లక్ష్మీకుమారితో పాటు రమణమ్మ, చింతా సుబ్బలక్ష్మి, షబీనా, నాగలక్ష్మి, రహమత్ ఉన్నీసా, హేమ, రాజేశ్వరి, జ్యోతి, పద్మ, సురేష్, నిర్మల, సత్యవతి తదితరులు వైఎస్సార్ సీపీలో చేరడం ఆనందంగా ఉందన్నారు. మూడు దశాబ్దాలకు పైగా ఒక పార్టీ జెండా మోస్తున్న కార్యకర్తలకు సరైన గుర్తింపు ఇవ్వకుంటే ఎవరికైనా బాధాకరమే అన్నారు. ఇప్పటికైనా మంచి నిర్ణయం తీసుకుని వైఎస్సార్ సీపీలో చేరడం శుభపరిణామమని అన్నారు. మాజీ కార్పొరేటర్ లక్ష్మీకుమారి మాట్లాడుతూ టీడీపీ కార్యకర్తలను ఆదిరెడ్డి వాసు బానిసల్లా చూస్తున్నారన్నారు. తన రెండో వార్డులోకి వచ్చి తనపైనే రంకెలు వేసి వాసు అవమానించారన్నారు. శెట్టిబలిజ, గౌడ సామాజిక వర్గీయులంటే వాసుకు చులకనభావం ఉందన్నారు. టీడీపీ ప్రతిష్ఠకు అలుపు లేకుండా కృషి చేసిన తమను అవమానించడం దారుణమని పితాని కుటుంబరావు అన్నారు. తమ కులాన్ని అవమానించడం చాలా బాధేసిందని అన్నారు. నగరంలో వైఎస్సార్ సీపీ విజయ పతాకం ఎగురవేసే వరకూ అవిశ్రాంతంగా కృషి చేస్తామన్నారు. తనతోటి కార్పొరేటర్లు కూడా తీవ్ర అసంతృప్తితో ఉన్నారని, రానున్న రోజుల్లో వైఎస్సార్ సీపీలో చేరడం ఖాయమని కుటుంబరావు అన్నారు. రాష్ట్ర దృశ్య కళల అకాడమీ చైర్మన్ కుడుపూడి శైలజ, మూల్ నివాసి జాతీయ మాజీ అధ్యక్షుడు నయనాల కృష్ణారావు, మాజీ కార్పొరేటర్లు వాసంశెట్టి గంగాధర్, పాలిక శ్రీను, మానే దొరబాబు, ప్రసాదుల హరినాథ్, వాకచర్ల కృష్ణ, పిల్లి నిర్మల, కడియాల శ్రీను, కుడుపూడి భరత్, రాయుడు గణేష్ తదితరులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన టీడీపీ మాజీ కార్పొరేటర్ తదితరులతో ఎంపీ భరత్‌రామ్

సమస్యలు పట్టించుకోని 'ఆదిరెడ్డి'

గత టీడీపీ పాలకుల నిర్లక్ష్యం, అనాలోచిత నిర్ణయాలు, అవగాహన లేమి కారణంగా నగర వీధుల్లో రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా ధ్వంసమయ్యాయని ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి మార్గాని భరత్‌రామ్ ధ్వజమెత్తారు. నగరపాలక సంస్థ ఏర్పడిన తరువాత వరుసగా మూడు సార్లు మేయర్ పదవులలో టీడీపీ వారే ఉన్నారని, దీర్ఘకాలంగా ఉన్న ఈ సమస్యను పట్టించుకోకపోవడం వల్లే ఈ పరిస్థితి దాపురించిందన్నారు. గత పుష్కరాల్లో నగరాభివృద్ధికి రూ.2 వేల కోట్లు ప్రభుత్వం మంజూరు చేసిందని, కనీసం ఆ నిధులతో డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరించినా ఇప్పుడు ఈ పరిస్థితి వచ్చేది కాదన్నారు. నగరంలో అభివృద్ధి టీడీపీ హయాంలోనే జరిగిందని పదే పదే డబ్బాలు కొట్టుకున్న ఆదిరెడ్డి వాసు, టీడీపీ నేతలు సమాధానం చెప్పాలన్నారు. తాను ఎంపీగా రెండున్నరేళ్లలో చేసిన అభివృద్ధిలో పదో వంతు చేసినా నగరానికి ఎంతో మేలు జరిగేదన్నారు. ఆదిరెడ్డి కుటుంబం ఉంటున్న తిలక్ రోడ్‌లో చిన్నపాటి వర్షానికే మునిగిపోయేదని, దానిని కూడా పట్టించుకోలేదన్నారు. తాను ఆ సమస్యను పరిష్కరించానని చెప్పారు. సిటింగ్ ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవానీ ఈ ఐదేళ్లలో నగరానికి ఏం చేశారో వాసు చెప్పి ప్రజలను ఓట్లు అడిగితే మంచిదన్నారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత మొట్టమొదట డ్రైనేజీ సమస్యల పరిష్కారంపైనే దృష్టి సారిస్తానని ఎంపీ ప్రకటించారు.

రాష్ట్రంలో ఫ్యాన్ గాలికి ఎదురు లేదు

- సంక్షేమ పథకాలతో ప్రతి ఒక్కరికీ లబ్ధి
- మంత్రి వేణుగోపాలకృష్ణ, ఎంపీ అభ్యర్థి గూడూరి



కొంతమూరులో ప్రచారం చేస్తున్న ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్, రూరల్ అభ్యర్థి వేణుగోపాలకష్ణ

రాజమహేంద్రవరం రూరల్: రాష్ట్రంలో ఫ్యాన్ గాలికి ఎదురు లేదని, త్వరలో జరగనున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీదే విజయమని మంత్రి, వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. బుధవారం ఉదయం కొంతమూరు చెంచుకాలనీ తదితర ప్రాంతాల్లో మంత్రి వేణుగోపాలకృష్ణ, ఎంపీ అభ్యర్థి గూడూరి శ్రీనివాస్‌లు రాష్ట్ర పచ్చదనం-సుందరీకరణ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ తదితరులతో కలసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లోని ఇంటింటికీ వెళ్లి ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలుకరించి సీఎం జగన్ ఐదేళ్ల పాలనలో అందించిన సంక్షేమ పాలన, పథకాలను ప్రజలకు వివరించి ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి తనను ఎమ్మెల్యేగా, గూడూరి శ్రీనివాస్‌ను ఎంపీగా గెలిపించి జగనన్నను ముఖ్యమంత్రిని చేయాలని మంత్రి పిలుపునిచ్చారు. సార్వత్రిక ఎన్నికలలో వైఎస్సార్ సీపీ గెలుపు తథ్యమన్నారు. జగన్ పాలనలో లక్షలాది మందికి ఇళ్ల స్థలాలు అందించడమే గాక పరిపాలన వ్యవస్థలో అనేక మార్పులు తీసుకొచ్చి పేదవాడికి మంచి చేసిన ఘనత మన వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. ప్రతి రంగంలోనూ తన ముద్ర కనపడేలా సర్వతోముఖాభివృద్ధికి బాటలు వేశారన్నారు. సీఎం జగన్‌ను ఎదుర్కొనే ధైర్యం లేక చంద్రబాబునాయుడు జనసేన, బీజేపీ పార్టీలతో పొత్తు పెట్టుకుని ముందుకు వస్తున్నారని, ప్రతిపక్షాల ఆశలు ఆవిరి కాకతప్పదన్నారు. ప్రజలకు మంచి చేసిన పార్టీకి ప్రజల్లో ఆదరణ ఎప్పుడూ ఉంటుందని, రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో నియోజక వర్గంలో గెలుపు కోసం ఆలోచించడం లేదని.. అత్యధిక మెజార్టీయే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామన్నారు. ఇంటికే సంక్షేమాన్ని అందించిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. 31 లక్షల ఇళ్లు మంజూరు చేసి దేశంలోనే చరిత్ర సృష్టించిన రాష్ట్రంగా ఆంధ్రకు పేరు తీసుకొచ్చారన్నారు. ఎంపీ అభ్యర్థి గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ కూటమి పేరుతో ప్రజలను మోసం చేసేందుకు వస్తున్న చంద్రబాబు మాటలను ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. గతంలో ఏ ప్రభుత్వాలు చేయని అభివృద్ధి, సంక్షేమం వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సాధ్యమైందన్నారు. చందన నాగేశ్వర్ మాట్లాడుతూ గడిచిన ఐదేళ్లలో మీ ఇంటి బిడ్డలా జగనన్న ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించారన్నారు.

మండుటెండలోనూ ప్రచారం

పోలింగ్ తేదీ సమీపిస్తుండడంతో మండుటెండను సైతం లెక్కచేయకుండా మంత్రి వేణు ఇంటింటా ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేశారు. తనను భారీ మెజార్టీతో గెలిపించాలని ఓట్లు అభ్యర్థించారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు జై జగన్ అంటూ కరపత్రాలను చేతపట్టుకుని ప్రతి ఇంటింటికీ అందించారు. ఐదేళ్లుగా అనేక పథకాలను అందిస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని కొనసాగించడానికి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో తాటికొండ విష్ణు, ఎంఎం ఆలీ, చెరుకూరి సత్యనారాయణ, అత్తిలి భీమశంకరం, పడాల ప్రసాద్, షేక్ చానా, షేక్ బాజీ, శ్రీనివాస్, తీటి ప్రసాద్, మానుకొండ శ్రీను, పరిమి దుర్గారావు, వాకపల్లి సుదర్శన్, పిన్నమరెడ్డి సూర్యచంద్రరావు, గాబ్రియల్, పిల్లా శ్రీను, ఖరి ముల్లా, లాయర్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బళ్లమ్మ తీర్థం



ప్రత్యేక అలంకరణలో బళ్లమ్మ తల్లి

పెదపూడి: కోరిన కోర్కెలు తీర్చే తల్లిగా పేరొందిన పెదపూడి బళ్లమ్మ తీర్థం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారి దర్శనానికి మండలం నలుమూలల నుంచి భక్తులు వేలాదిగా తరలి రావడంతో ఆలయంలో ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటుచేశారు. స్థానికులు, ఇతర స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు చలివేంద్రాలు ఏర్పాటు చేసి భక్తులకు మజ్జిగ, మంచినీటి ప్యాకెట్లు అందించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎస్‌ఐ శోభన్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

వచ్చేది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే..

కడియం: మళ్లీ వచ్చేది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమేనని ఆ పార్టీ రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. కడియం మండలంలోని పలు గ్రామాల్లో వారు బుధవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. పొట్టిలంక, వీరవరం, కడియపులంక గ్రామాల్లో స్థానిక నాయకులతో కలిసి నిర్వహించిన ఎన్నికల ప్రచారానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేసి వైఎస్సార్ సీపీని అధికారంలోకి తీసుకువస్తే పథకాలన్నీ కొనసాగుతాయన్నారు. గతంలో ఎప్పుడూ జరగని విధంగా రాష్ట్రంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చామన్నారు. ప్రజల ఆశీస్సులే తమ పార్టీకి శ్రీరామరక్ష అని అన్నారు. గతంలో చంద్రబాబు రైతు రుణమాఫీ చేయలేదని, డ్వాక్రా రుణాల బకాయిలు తీర్చలేదన్నారు. ఇప్పుడు మళ్లీ బూటకపు హామీలతో చంద్రబాబు వస్తున్నారని, ఆ మాటలు నమ్మవద్దని ప్రజలకు పిలుపునిచ్చారు. పేదల భవిష్యత్తు మారాలన్నా.. వలంటీర్లు మళ్లీ ఇంటికి రావాలన్నా వైఎస్సార్ సీపీ అధికారం చేపట్టాలన్నారు. మంచి చేసిన ఫ్యాన్ ఇంట్లో ఉండాలని.. చెడు చేసిన సైకిల్ ఇంటి బయట పెట్టాలన్నారు. తాగేసిన టీ గ్లాసును సింక్‌లోనే పడేయాలన్నారు. ఈ ఎన్నికలు కేవలం ఎమ్మెల్యేలు, ఎంపీలను ఎన్నుకునేందుకు మాత్రమే కాదని పేదల ఇంటి భవిష్యత్‌ను నిర్ణయించేవన్నారు. తాము సామాజిక న్యాయం చేసి చూపించామన్నారు. పేదల భవిష్యత్ మారాలంటే పథకాలన్నీ కొనసాగాలంటే, వైఎస్సార్ సీపీని గెలపించాలని వారు పిలుపునిచ్చారు. జగనన్న పాలనలో ప్రతి కుటుంబానికి కనీసం ఒక్క పథకమైన అందిందన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలంటే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రావాలన్నారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో పార్టీకి పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. నవరత్నాల్లాంటి సంక్షేమ పథకాలతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల హృదయాల్లో సుస్థిరస్థానం సంపాదించారన్నారు. కుల, మత వర్గ బేధాలు లేకుండా అర్హతే ప్రామాణికంగా నేరుగా ఇంటికే సంక్షేమ లబ్ధి అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. ఏపీ స్టేట్ గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్, పొట్టిలంక, వీరవరం, కడియపులంక గ్రామాల వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కడియం మండలంలో ఎమ్మెల్యే అభ్యర్థి వేణు, ఎంపీ అభ్యర్థి గూడూరి శ్రీనివాస్ ప్రచారం

చేనేత, పద్మశాలీల సంక్షేమానికి పెద్దపీట

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- పెదపూడిలో చేనేత, పద్మశాలీల ఆత్మీయ సమావేశం

పెదపూడి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేనేత, పద్మశాలీల సంక్షేమానికి పెద్దపీట వేశారని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. పెదపూడి గ్రామంలో మంగళవారం రాత్రి చేనేత, పద్మశాలీల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర చేనేత విభాగం కార్యదర్శి పప్పు సింహాచలం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి, ఆయన సతీమణి ఆదిలక్ష్మి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పద్మశాలీల అభివృద్ధికి వైఎస్సార్ సీపీ కట్టుబడి ఉందన్నారు. పెదపూడిలో పద్మశాలీల సంక్షేమానికి సామాజిక భవనం నిర్మించామన్నారు. గ్రామంలో రూ.7 కోట్లతో ఆస్పత్రి, రూ.1.2 కోట్లతో హైస్కూల్, రూ.13 కోట్లతో తాగునీటి చెరువుల ఆధునీకరణ, 600 మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేశామన్నారు. ఈ నెల 13 జరిగే ఎన్నికల్లో అందరు ఫ్యాను గుర్తుపై ఓటు వేసి తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర చేనేత కార్యదర్శి పప్పు సింహాచలం మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ రాష్ట్రంలో నేతన్న నేస్తం పథకంలో చేనేత కార్మికులకు ఏడాదికి రూ.24 వేలు అందజేశారన్నారు. మూడేళ్ల కాలంలో దాదాపు రూ.576 కోట్లు చేనత కార్మికులకు పంపిణీ చేశారన్నారు. రాష్ట్రంలో పద్మశాలీలకు రెండు ఎమ్మెల్సీ, ఒక ఎంపీ, 7 మున్సిపల్ కార్పొరేషన్ చైర్మన్లు, ఇద్దరికి టీటీడీ బోర్డు మెంబర్ పదవులు, అలాగే పద్మశాలీ, తొగట, దేవాంగ కరిణశాలీ కార్పొరేషన్ల చైర్మన్ల పదవులు ఇచ్చి తమకు ప్రాధాన్యమిచ్చారన్నారు. తామంతా ముఖ్యమంత్రిగా జగన్‌ను, ఎమ్మెల్యేగా సూర్యనారాయణరెడ్డిని, ఎంపీగా గూడూరి శ్రీనివాస్‌ను గెలిపించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో పద్మశాలీల సంఘం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు పంపన రామకృష్ణ మాట్లాడుతూ చేనేతకు కొత్త ట్రెండ్‌ను క్రియేట్ చేస్తూ ఆర్గానిక్ వస్త్రాల తయారీ వంటి వినూత్న ప్రయోగాలతో ప్రభుత్వం నేతన్నను ప్రోత్సహిస్తుందన్నారు. అనంతరం ఎమ్మెల్యే దంపతులను గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు సమ్మంగి దుర్గా ప్రసాద్, పీఏసీఎస్ చైర్మన్ మార్ని కామరాజు చౌదరి, చింతకింద రాము, పెనుగొండ శ్రీను, మీసాల నాగరాజు, చీపూరి శ్రీను, తంగెళ్ల రాజు, పందిరి సూర్యప్రకాశ్, పప్పు జోగారావు, సీతామహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి దంపతులను గజమాలతో సత్కరిస్తున్న పప్పు సింహాచలం

కేబుల్ ఆపరేటర్లకు న్యాయం చేస్తా..



కేబుల్ ఆపరేటర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ భరత్‌రామ్

రాజమహేంద్రవరం సిటీ: వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాకే కేబుల్ ఆపరేటర్లకు న్యాయం జరిగిందని ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి మార్గాని భరత్‌రామ్ అన్నారు. బుధవారం నగరంలోని రౌతు తాతాలు కల్యాణ మండపంలో నగర కేబుల్ ఆపరేటర్ల విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా భరత్‌రామ్ మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాలు, వివిధ రంగాల్లో పనిచేసే కార్మికులకు చేతనైనంత సహాయ సహకారాలు అందించారన్నారు. వారందరినీ ఆర్థికంగా ఆదుకునేందుకు కృషి చేస్తున్నారన్నారు. సంఘ ప్రతినిధులు పలు డిమాండ్లు తన దృష్టికి తీసుకొచ్చారని, వీటిని తిరిగి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి జగనన్నకు తెలియజేసి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. తప్పనిసరిగా వారి సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని మాటిచ్చారు. కేబుల్ వర్కర్స్‌కు ఈఎస్ఐ సభ్యత్వం వచ్చేలా సంబంధిత అధికారులతో ఎన్నికలయ్యాక మాట్లాడతానన్నారు. సిటీ ఎమ్మెల్యేగా తనను ఆశీర్వదించి గెలిపిస్తే నగరాన్ని మరింత అభివృద్ధి చేస్తానన్నారు. నగరంలో అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపుతానని చెప్పారు. బ్లేడ్, గంజాయి బ్యాచ్‌లు, రౌడీ షీటర్లు, పచ్చబొట్ల బ్యాచ్‌లు లేకుండా చూస్తానన్నారు. నగరంలో అలజడులు, అశాంతి సృష్టించి రాజకీయ లబ్ధి పొందేందుకు కొంతమంది పేట్రేగిపోతున్నారని ధ్వజమెత్తారు. వారికి ఓటుతోనే సమాధానం చెబుదామని పిలుపునిచ్చారు. సమావేశంలో రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు, పార్టీ అబ్జర్వర్ రావిపాటి రామచంద్రరావు, కేబుల్ ఆపరేటర్ల సంఘ ప్రతినిధులు ఇసుకపల్లి సత్యనారాయణ, నందెం సుబ్బారావు, ప్రసాదుల హరినాథ్, వాసంశెట్టి నాగేశ్వరరావు, వాకచర్ల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న నిఘా



కోరుకొండ సమీపంలో జాతీయ రహదారిపై వాహనాలను తనిఖీ చేస్తున్న సెబ్ అధికారులు

మధురపూడి: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా రాత్రి వేళల్లో సైతం తనిఖీలు నిరంతరాయంగా సాగుతున్నాయి. సెబ్ కోరుకొండ సీఐ బంగారురాజు ఆధ్వర్యంలో బుధవారం రాత్రి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ విలేకరులతో మాట్లాడుతూ సెబ్ జిల్లా ఎస్పీ పిట్టా సోమశేఖర్ ఆదేశాల్లో భాగంగా తనిఖీలు నిర్వహిస్తున్నట్టు వివరించారు. కోరుకొండ మండలం పరిధిలోని జాతీయ రహదారిపై వివిధ ప్రాంతాల్లో ప్రైవేట్ వాహనాలను తనిఖీ చేస్తున్నామన్నారు. వాహనాల్లో నగదు, మద్యం, గంజాయి తరలించకుండా ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. సెబ్ కోరుకొండ ఎస్సై వంశీ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

సీతానగరం: కాటవరం వద్ద ఆర్టీసీ బస్సును మోటారు సైకిల్‌పై వస్తున్న నాంబత్తుల రాజేష్ ఢీకొట్టడంతో స్వల్ప గాయాలయ్యాయి. బుధవారం సీతానగరం నుంచి రాజమహేంద్రవరం వెళ్తున్న ఆర్టీసీ బస్సును కాటవరం వద్ద మోటారు సైకిల్‌పై తన ఐదేళ్ల మేనల్లుడిని ఎక్కించుకుని ఎదురుగా వచ్చి రాజేష్ ఢీకొట్టారు. దీంతో రాజేష్‌తోపాటు అతని మేనల్లుడికి స్వల్ప గాయాలయ్యాయి. ఆర్టీసీ డ్రైవర్ తప్పులేదని గ్రహించిన జాలిమూడి సర్పంచ్ భర్త, వైఎస్సార్ సీపీ నాయకుడు మద్దిపాటి సుబ్బారావు రాజీ చేశారు.

సినిమాలు



శ్యామల	: ఆ ఒక్కటీ అడక్కు
సూర్యమినీ	: దీఫాల్‌గమ్
సూర్యప్యాలెస్	: సబరి
శివజ్యోతి	: గీతాంజలి మళ్లీ వచ్చింది
అనుశ్రీ	: మంజుమ్మల్ బాయ్స్
ఊర్వశి	: ప్రసన్నవదన
రంభ	: బాక్
మేనక	: రత్నం
అప్సర	: టిల్లు స్క్వేర్
కుమారి	: సబారి, టిల్లుస్క్వేర్
నామవరం:	
వీఎస్.మహల్	: ఆ ఒక్కటీ అడక్కు
ధవళేశ్వరం:	
మురళీకృష్ణ	: గాడ్జిల్లా అండ్ కాంగ్, సబారి
కడియం :	
వెంకటసూర్య	: ఆ ఒక్కటీ అడక్కు